# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో తిరుమల వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు.
- ❖ విజయనగరం శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- ❖ రాష్ట్రంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు వెల్లడించారు.

==============================

రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు పౌర సరఫరాల శాఖ తీసుకుంటున్న చర్యలపై ఉండవల్లిలో ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ధరల నియంత్రణకు, తాత్కాలికంగా, దీర్ఘకాలికంగా చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలపై ధరల భారం లేకుండా చూడాలని, డిమాండ్ సరఫరా మధ్య వ్యత్యాసానికి గల కారణాలను విశ్లేషించి తగు చర్యలు చేపట్టాలని సూచించారు. పౌర సరఫరా, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ ద్వారా ధరల పెరుగుదలను గ్రహించి, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

==============================

ఉత్తరాంధ్ర ఇలవేల్పు, విజయనగరం శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరంలో ఈ రోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... రేపు విజయనగరం ఉత్సవాలతో పాటు, ఈ నెల 14, 15వ తేదీల్లో పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం, సిరిమానోత్సవాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. ఉత్సవాలలో బందోబస్తు కోసం 6 జిల్లాల నుంచి 2 వేల మందిని నియమించామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలని విజయవంతంగా నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

==============================

తిరుమల వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు. తిరుమలలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష జరిపి నిర్ణయాలు తీసుకుని, తిరుమలలో వాహనాల రద్దీ తగ్గేలా చర్యలు తీసుకున్నామని తెలుపుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

మరోవైపు తిరుమలలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన చక్రస్నానాన్ని నిర్వహించారు. ఈ రోజు రాత్రి జరిగే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

==============================

దేవాలయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఈ రోజు నిర్వహించిన విజయదశమి ముగింపు వేడుకలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దేవాలయాలకు స్వయంప్రతిపత్తి హోదాను కల్పించామన్నారు. ఆలయాల నిర్వహణ కోసం ధూప దీప నైవేద్యాలకు ప్రత్యేక నిధులను కేటాయించామని తెలిపారు.

==============================

రాష్ట్రంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందించామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు తెలిపారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఈ రోజు నిర్వహించిన విజయదశమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో పుణ్యక్షేత్రాలకు వెళ్లడానికి వీలుగా వారాంతపు సెలవులలో ప్రత్యేకమైన బస్సులు ఏర్పాటు చేయనున్నామన్నారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించేందుకు వీలుగా రాయితీతో కూడిన పాసులను అందిస్తున్నట్లు తెలిపారు.

==============================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 16వ తేదీన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సమావేశం కానుంది. ఈ సమావేశంలో చర్చించి, ఆమోదించాల్సిన అంశాలపై 14వ తేదీ సాయంత్రం లోపు ప్రతిపాదనలు పంపించాలని వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. కాగా ఈ నెల 10వ తేదీన మంత్రివర్గం సమావేశమైనప్పటికీ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి కారణంగా ఆయనకు నివాళులు అర్పించి సమావేశాన్ని వాయిదా వేశారు.

విరామం

==============================

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ శాఖ అధికారి శేష సాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ..

వాయిస్ (31 సెకెన్లు)

==============================

విజయవాడ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పదవ రోజైన ఈ రోజు విజయ దశమి పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉత్సవాల చివరి రోజు కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మరోవైపు శ్రీశైల భ్రమరాంబికా అమ్మవారు ఈరోజు సాయంత్రం నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. స్వామి అమ్మవార్లకు నందివాహనంపై గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు.

==============================

దసరా పండుగను పురస్కరించుకొని కర్నూలు జిల్లాలో ప్రసిద్ధ దేవరగట్టు శ్రీ మాళమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాన్ని ఈ రోజు రాత్రి నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాన్ని నిర్వహించేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరానున్నారు. గట్టుపై అర్ధరాత్రి మాళ మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం అనంతరం ఉత్సవమూర్తుల జైత్రయాత్ర ప్రారంభమవుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

==============================

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం, నల్లబొమ్మనిపల్లిలో జరిగిన అత్యాచార ఘటపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ ఘటనపై జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రత్నతో ఆయన మాట్లాడి దర్యాప్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టాలని ఎస్పీకి ఆదేశించారు. మరో వైపు ఈ ఘటనపై రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. అత్యాచారానికి పాల్పడిన వారిని సత్వరమే అరెస్ట్ చేయాలని ఎస్పీని ఆదేశించారు. కేసు నమోదు చేసి ఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్పీ హోం మంత్రికి వివరించారు. బాధిత మహిళలకు ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు.

==============================

రేషన్ కార్డుపై రాయితీపై వంట నూనెలను రాష్ట్రప్రభుత్వం అందిస్తోందని విశాఖపట్నం జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కరరావు తెలిపారు. విశాఖలోని మర్రిపాలెం రైతుబజారులో ఏర్పాటు చేసిన సబ్సిడీ వంట నూనెలు విక్రయకేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ... మార్కెట్ లో ధరలు పెరుగుతున్నందున, వినియోగదారులకు రాయితీపై వంట నూనెలను అందిస్తున్నామన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

==============================
==============================